పథకాలు అమలు చేయాలి

ముషీరాబాద్ టూవీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం గాంధీనగర్‌లో 'వరల్డ్ మెకానిక్ డే' వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ గౌడ్ మాట్లాడుతూ.. డాక్టర్ డే, లాయర్స్ డే మాదిరిగా మెకానిక్స్‌కు ఒక్కరోజు నిర్ణయించడం సంతోషకరం అన్నారు. ప్రభుత్వం సబ్సిడీతో రుణాలివ్వాలని, పథకాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బల్ల ప్రశాంత్, అసోసియేషన్ నాయకులు కిట్టు, జగదీశ్, సాజిద్, ఎస్వీ రెడ్డి, తిరుపతి, శ్రీనివాస్, నాగరాజ్‌గౌడ్, కరుణాకర్, సీతారాం పాల్గొన్నారు. - చిక్కడపల్లి

వట్టికోట ఆల్వార్ స్వామి స్మారక పురస్కారం ప్రదానం

తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయం సెంట్రల్ ఫోరం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అయోధ్యకు వట్టికోట ఆల్వార్ స్వామి స్మారక పురస్కారం దక్కింది. కామన్ డయాస్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త దైవజ్ఞ శర్మ, ప్రముఖుల చేతుల మీదుగా పురస్కారం అందున్నారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు, ఉద్యోగులు పాల్గొన్నారు.
- చిక్కడపల్లి

పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

అశోక్ నగర్‌లో పారిశుధ్య నిర్వహణను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, జూలై 3 : వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ పారిశుధ్య సిబ్బందికి సూచించారు. ప్రజావాణిలో ఫిర్యాదు మేరకు బుధవారం ఉదయం గోల్నాక డివిజన్ అశోక్ నగర్‌లో ఎమ్మెల్యే ఏఎంహెచ్‌వో హేమలతతో కలసి తనిఖీలు నిర్వహించారు. రహదారులపై పేరుకుపోయిన వ్యర్థాలను చూసి అసహనం వ్యక్తం చేశారు. రహదారులతో పాటు బస్తీ, కాలనీ అనే తేడా లేకుండా వ్యర్థాలను శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో అంటు వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణలో రాజీ పడే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే కాలేరు స్పష్టం చేశారు.

గృహజ్యోతి పథకంపై ప్రత్యేక దృష్టి

గృహజ్యోతి పథకం కింద లబ్ధిదారులను గుర్తించి పథకం సక్రమంగా అమలు చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అధికారులను ఆదేశించారు. గోల్నాకలోని క్యాంపు కార్యాలయంలో విద్యుత్ అధికారులతో విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చూడాలని అధికారులకు సూచించారు. కొన్ని ప్రాంతాల్లో ప్రహారీ వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో డీఈ కమల్ కుమార్, ఏడీ శ్రీనివాస్, ఏఈలు శ్రీనివాస్, అంజన్, ప్రసాద్ పాల్గొన్నారు.

మన్నన్‌ఖాన్ ఇంజనీర్ ఏర్పాటు చేసిన జాబ్‌మేళాను ప్రారంభిస్తున్న సోషల్ యాక్టివిస్ట్ సిద్ధారెడ్డి, సినీ నటుడు ఇంద్రసేనారెడ్డి

అభ్యర్థులకు నిర్వాహకులు మన్నన్‌ఖాన్ ఇంజనీర్‌తో కలిసి ఆఫర్ లెటర్ ను అందజేస్తున్న సౌత్ వెస్ట్ జోన్ అదనపు డీసీపీ మహ్మద్ అష్ఫాక్

జాబ్ మేళాకు విశేష స్పందన

అబిడ్స్, జూలై 3 : డెక్కన్ బాస్టర్స్ చైర్మన్ మన్నన్‌ఖాన్ ఇంజనీర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాబ్ మేళా కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. బుధవారం గుడిమల్కాపూర్‌లోని కింగ్స్ ప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన జాబ్ మేళాను సోషల్ యాక్టివిస్ట్ సిద్ధారెడ్డి, సినీ నటుడు ఇంద్రసేనారెడ్డి, సౌత్ వెస్ట్ జోన్ అదనపు డీసీపీ మహ్మద్ అష్ఫాక్ ప్రారంభించారు. వారు వేర్వేరుగా మాట్లాడుతూ.. నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించాలనే సంకల్పంతో మన్నన్‌ఖాన్ ఇంజనీర్ జాబ్ మేళాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. తరచుగా జాబ్ మేళాలను నిర్వహిస్తుండడంతో నిరుద్యోగులకు మేలు జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా వివిధ కంపెనీల ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూలలో ప్రతిభ కనబర్చిన వారికి ఆఫర్ లెటర్ ను అందజేశారు.

బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మా వెంకటరెడ్డి బుధవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు.6న జరుగబోయే జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహం, పార్టీ సంస్థాగతంగా బలోపేతం చేసే విషయాలపై చర్చించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బి.వెంకటరెడ్డి, నీలకంఠం వెంకటరమణ రాజు, సంజీవ్, కె.సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.
- అంబర్‌పేట

పార్టీ పటిష్టతకు పాటు పడాలి

పార్టీ బలోపేతానికి పాటు పడాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎం. ఆనంద్‌కుమార్ గౌడ్ కేటీఆర్‌ను ఆయన నివాసంలో కలిసి పార్టీ పరిస్థితిని వివరించారు. ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలలో వ్యతిరేకత ప్రారంభమైందన్నారు. ప్రజలు తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని వివరించారు.
- అబిడ్స్

బీసీలకు రూ.2 లక్షల కోట్లు కేటాయించాలి

సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జ కృష్ణ,నందగోపాల్

కాచిగూడ, జూలై 3 : కేంద్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో బీసీలకు రూ.2 లక్షల కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో కాచిగూడ అభినందన్ హోటల్‌లో బీసీ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నందగోపాల్, వి.రామకృష్ణ, సుధాకర్ పాల్గొన్నారు.

గర్భిణులకు కిట్ల పంపిణీ

చిక్కడపల్లి, జూలై 3 : గాంధీనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రత్నాసాయి చంద్ ఆధ్వర్యంలో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ జన్మదినం సందర్భంగా గర్భిణులకు ప్రోటీన్ కిట్లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ హాజరై కార్యక్రమం ప్రారంభించారు.

అన్నదానం ..

చిక్కడపల్లి, జూలై 3 : రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ జన్మదినం సందర్భంగా ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు, బీజేపీ సీనియర్ నాయకుడు పూస రాజు ఆధ్వర్యంలో బుధవారం అశోక్‌నగర్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో లక్ష్మణ్ కుమారుడు రాహుల్, పార్టీ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు సాయిచంద్, రవి కుమార్, మద్దూరి శివాజీ, కాలనీ అసోసియేషన్ నాయకులు బాబురావు, సరేశ్, స్వామి రావు, రాజేశ్, జనార్దన్, రవి,నాని పాల్గొన్నారు.

బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ జన్మదినం సందర్భంగా బుధవారం గోషామహల్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్ ఇమ్లిబన్ గోశాలలో గో మాతకు పూజలు చేసి, గడ్డి తినిపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు శ్రీనివాస్ యాదవ్, అమర్‌సింగ్, రామకృష్ణ, రాజు, సందీప్ జైన్, రవికాంత్ పాల్గొన్నారు.
- అబిడ్స్

బోనాలను ఘనంగా నిర్వహించాలి

గోల్కొండ కోట జగదాంబిక ఎల్లమ్మ ఆలయంలో జరిగే ఆషాఢ బోనాలను ఘనంగా నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గోల్కొండ బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన కాంత అరవింద్ మహేశ్‌కుమార్ బుధవారం సీఎంను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. జూలై 7న ప్రారంభం కానున్న బోనాలను విజయవంతంగా నిర్వహించడానికి కృషి చేస్తానని అరవింద్ మహేశ్ కుమార్ ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి చెప్పారు.
- మెహిదీపట్నం

గోల్కొండ ఎల్లమ్మకు పూజలు

బోనాల నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చేస్తామని దేవాదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణ అన్నారు. బుధవారం గోల్కొండ కోటపై ఉన్న జగదాంబిక మహంకాళి (ఎల్లమ్మ) ఆలయం వద్ద బోనాల ఏర్పాట్లను పరిశీలించారు. అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ బాలాజీ, ఈవో శ్రీనివాస రాజు, ఆలయ అర్చకులు సర్వేశ్ చారి, కులవృత్తుల సంఘం సభ్యులు శంకర్ పటేల్, కె.శ్రవణ్, టి.శివశంకర్, వి.శివ, రాములు పాల్గొన్నారు.
- మెహిదీపట్నం

నియామక పత్రం అందజేత

గోల్కొండ కోట జగదాంబిక మహంకాళి ఎల్లమ్మ ఆలయం బోనాల ఉత్సవాల కమిటీ సభ్యురాలిగా ఎన్నికైన లంగర్‌హౌస్‌కు చెందిన సీనియర్ మహిళా నాయకురాలు మత్స్య రేణుకకు కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ నియామక పత్రం అందజేశారు.
- మెహిదీపట్నం

బోనాల నిర్వహణకు సహకరించాలి

మాట్లాడుతున్న దక్షిణ,పశ్చిమ మండలం డీసీపీ ఉదయ్‌కుమార్ రెడ్డి

మెహిదీపట్నం, జూలై 3 : గోల్కొండ కోట జగదాంబిక మహంకాళి (ఎల్లమ్మ) ఆలయం లో బోనాల నిర్వహణకు అందరూ సహకరించాలని దక్షిణ, పశ్చిమ మండలం డీసీపీ ఉదయ్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం గోల్కొండ పోలీస్ స్టేషన్‌లో బోనాల ఉత్సవ కమిటీ, మైత్రి,పీస్ కమిటీ నాయకులతో పోలీసులు సమావేశం నిర్వహించారు. డీసీపీ ఉదయ్‌కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. గోల్కొండ, లంగర్‌హౌస్‌లో జరిగే బోనాలను సామరస్యంగా జరుపుకోవాలన్నారు. సమావేశంలో ఆలయ సలహాదారు, సంఘ సేవకులు, మైత్రి, పీస్ కమిటీ అధ్యక్షులు సిరుగుమల్లె రాజువస్తాద్, ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్ సైదులు, గోల్కొండ బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ కాంత అరవింద్ మహేశ్ కుమార్, కులవృత్తుల సంఘం అధ్యక్షుడు సాయిబాబాచారి, కాంగ్రెస్ నాయకులు జీవన్‌సింగ్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించాలి..

తెలంగాణ జలమండలి కాంట్రాక్టర్ అసోషియేషన్ జేఏసీ మీడియా ఇన్‌చార్జి, కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ బుధవారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి చిన్న కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చాలా మంది బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని, వారిని ఆదుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలన్నారు.
- అబిడ్స్

వాహనాల తనిఖీలు

కాచిగూడ, జూలై 3 : కాచిగూడ పీఎస్ పరిధిలోని లింగంపల్లి ఎక్స్‌రోడ్, కాచిగూడ రైల్వేస్టేషన్ ప్రాంతంలో మంగళవారం రాత్రి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. అనుమానిత వ్యక్తుల గుర్తింపు కార్డులు, వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు చూపించక పోవడంతో 12 ద్విచక్రవాహనాలను పీఎస్‌కు తరలించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్సై డి.సుభాష్, ఎస్సైలు పి.రవికుమార్, హెచ్.నరేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలని కాచిగూడ డివిజన్ ఏసీపీ రఘు అన్నారు. బోనాలు, మొహర్రం నేపథ్యంలో బుధవారం అంబర్‌పేట పీఎస్‌లో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ డి.అశోక్‌తో కలసి ఆయన మాట్లాడారు.అన్ని మతాల ప్రజలు పండుగలు సోదరభావంతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు.శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.ఉత్సవాల్లో శాంతి కమిటీ సభ్యులు పోలీసులకు సహకరించాలని కోరారు.
- గోల్నాక

విద్యార్థులు సన్మార్గంలో నడువాలి

కాచిగూడ, జూలై 3 : విద్యార్థులు సన్మార్గంలో నడువాలని, మాదకద్రవ్యాలు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని హిమాయత్‌నగర్ జోన్ డిప్యూటీ ఈఓ విజయలక్ష్మి సూచించారు. కాచిగూడ జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో బుధవారం డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం –సమాజాన్ని మెల్కొల్పుదాం కార్యక్రమంపై ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ ఈఓ విజయలక్ష్మి హాజరయ్యారు. విద్యార్థి దశ విలువైందని, ఉన్నత ఆశయాలతో లక్ష్యం ఏర్పర్చుకుని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో హిమాయత్‌నగర్ ఐఓఎస్ ఆర్.సుమన్, కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత, హెచ్ఎం విజయలక్ష్మి, ఏఎంహెచ్ఓ హేమలత, ప్రసాద్‌రావు, డాక్టర్ లక్ష్మయ్య గంగపుత్ర, రాజు, రఘు పాల్గొన్నారు.

కాచిగూడ,జూలై 3 : విద్యార్థులు కష్టపడి చదివితే అద్భుత విజయాలు సాధిస్తారని, క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేశ్‌యాదవ్ అన్నారు. మోతి మార్కెట్‌లోని జీయూపీఎస్ పాఠశాల విద్యార్థులకు బుధవారం నోట్ బుక్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రమేశ్‌యాదవ్, సుభాష్ పటేల్, సంతోష్, మురళీమోహన్‌రావు, శైలెందర్,ఓంప్రకాశ్, వాసు, సూరి, రవియాదవ్, గాయత్రి దేశాయ్,రమణ, సుచిత్ర పాల్గొన్నారు.

లా కోర్సుల పరీక్షా రీవాల్యూయేషన్ ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 3: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్షా రీవాల్యూయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ తదితర కోర్సుల రీవాల్యూయేషన్ ఫలితాలను విడుదల చేశామన్నారు. ఈ ఫలితాల కోసం ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

వివిధ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 3: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్ కోర్సుల నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ కోర్సుల నాలుగు, ఆరు, ఎనిమిదో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్, ఎల్ఎల్ఎం నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షా ఫీజును ఈ నెల 24లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు. రూ.200 అపరాధ రుసుముతో 30 వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

అకడమిక్ హైట్స్ పాఠశాలలో కేబినెట్ సదస్సు

అకడమిక్ హైట్స్ పాఠశాలలో నిర్వహించిన కేబినెట్ సదస్సులో పాల్గొన్న రీజినల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, డైరెక్టర్ రూపారెడ్డి

అంబర్‌పేట, జూలై 3 : బాగ్‌అంబర్‌పేట డీడీ కాలనీలోని అకడమిక్ హైట్స్ పాఠశాలలో బుధవారం కేబినెట్ సదస్సు(ఇన్‌వెస్టిచర్ సెర్మనీ) నిర్వహించారు.

దీనికి ముఖ్య అతిథిగా పాఠశాల రీజినల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, డైరెక్టర్ రూపారెడ్డి హాజరై విద్యార్థులకు స్కూల్ ఫ్లాగ్, హౌస్ ఫ్లాగ్, బ్యాడ్జీలు అందజేసి వారిని అభినందిస్తూ వారికి విధులను అప్పగించారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ సులక్షణ అంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయండి

నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి డివిజన్‌లో జలమండలి ఆధ్వర్యంలో జరుగుతున్న సీవరేజీ, తాగునీటి పైపులైన్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి జాఫర్‌ఖాన్ జలమండలి జీఎం జానీ షరీఫ్‌ను కోరారు. బుధవారం రెడ్‌హిల్స్ జలమండలి కార్యాలయంలో జీఎంను కలిసి పెండింగ్ పనులపై చర్చించారు.
- అబిడ్స్

తెలంగాణ బాటిల్ స్పోర్ట్స్ డాన్స్ సెక్రటరీగా లక్ష్మీప్రసన్న

తెలంగాణ బాటిల్ స్పోర్ట్స్ డాన్స్ సెక్రటరీగా పంతంగి లక్ష్మీప్రసన్నను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం దోమలగూడలోని పీఈటీ కాలేజీలో తెలంగాణ బాటిల్ స్పోర్ట్స్ డాన్స్ సభ్యుల సమావేశం జరిగింది. బాటిల్ స్పోర్ట్స్ ఇండియా ప్రెసిడెంట్ నిఖిల్‌తాంబే సమావేశంలో లక్ష్మీప్రసన్న ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో బాటిల్ స్పోర్ట్స్ డాన్స్ క్రీడలను ప్రచారంలోకి తెచ్చేందుకు కృషిచేస్తానన్నారు.
- రవీంద్రభారతి

ఆల్ ఇండియా వైశ్య ఫెడరేషన్ రాంనగర్ డివిజన్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా కల్వ సితార నియమితులయ్యారు. వైశ్య సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ అంతర్జాతీయ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త, సలహా మండలి చైర్మన్ గంజి రాజమౌళి గుప్త ఆమెకు నియామక పత్రం అందజేశారు.
- ముషీరాబాద్

ప్రసూతి సేవలపై సమావేశం

గోల్కొండ ఏరియా దవాఖాన ప్రసూతి సేవల విస్తరణపై డీఎంహెఓ డాక్టర్ వెంకటి, దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా బుధవారం వైద్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గోల్కొండ ఏరియా దవాఖానలో గర్భిణులకు ఉత్తమ సేవలు అందించడానికి డాక్టర్లు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఎస్‌పీహెచ్ఓ డాక్టర్ మురళి, ఆర్ఎంఓ వినాయకరావు పాల్గొన్నారు.
- మెహిదీపట్నం